ప్రజాశక్తి
శుక్రవారం 5 డిసెంబరు, 2025
5
శ్రీకాకుళం



7న నవోదయ మోడల్ పరీక్ష

శ్రీకాకుళం సిటీ: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చేపట్టిన ఎర్రన్న విద్యా సంకల్పంలో భాగంగా జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశాలకు సన్నద్ధమవుతున్న విద్యార్థులకు నమూనా పరీక్షను ఈనెల 7వ తేదీన నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. నవోదయ పాఠశాల ప్రవేశం కోసం ప్రధాన పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు, చిన్న వయసులో పోటీ పరీక్షల పట్ల భయాన్ని తొలగించేందుకు ఈ నమూనా పరీక్ష దోహదం చేస్తుందని పేర్కొన్నారు. శ్రీకాకుళం పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాలకు సమీప ప్రాంతాల్లో ప్రధాన పరీక్షకు దీటుగా ఆ స్థాయిలో అదే సమయపాలన, ప్రశ్నపత్ర సరళితో నమూనా పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఇందుకోసం https://www.yvssrikakulam.live/navodaya-registration వెబ్‌సైట్‌లో ముందుగా విద్యార్థులు వారి వివరాలు నమోదు చేసి రిజిస్టర్ కావాలని సూచించారు. ఆదివారం ఉదయం 11.30 గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందని, అరగంట ముందు హాజరు కావాలని స్పష్టం చేశారు.

ఎత్తిపోతల పూర్తికి ఎన్నేళ్లు?

ఆ సాగునీటి పథకానికి ఒడిశా అభ్యంతరాలు లేవు. నిర్మాణ పనులు చేపట్టడానికి ఆటంకాలూ లేవు. ప్రభుత్వంతో కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం నిర్మాణ సంస్థ తనకు రావాల్సిన బిల్లులను చెల్లించలేకపోయినా కొన్నాళ్లు పనులు ఆపలేదు. ఏడాదిలో పూర్తి కావాల్సిన పథకం మాత్రం మూడేళ్లు గడుస్తున్నా, నేటికీ పూర్తి కాలేదు. ఇదీ హిరమండలం రిజర్వాయర్ వద్ద నిర్మించతలపెట్టిన ఎత్తిపోతల పథకం పరిస్థితి. నేరడి బ్యారేజీకి ఒడిశా అభ్యంతరాల నేపథ్యంలో బ్యారేజీ నిర్మాణం ఆలస్యమవుతుందనే కారణంతో గత వైసిపి ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని ఘనంగా ప్రారంభించినా, పైసా డబ్బులు చెల్లించలేదు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర అవుతున్నా, టిడిపి కూటమి ప్రభుత్వం రూపాయి ఇవ్వలేదు. దీంతో ఇతర పెండింగ్ ప్రాజెక్టుల జాబితాలోనే ఈ ఎత్తిపోతల పథకం కూడా చేరిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రజాశక్తి – శ్రీకాకుళం ప్రతినిధి



ఎత్తిపోతల పథకం కోసం పైపులైన్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

- గొట్టాబ్యారేజీ లిఫ్ట్ ఇరిగేషన్ పనుల్లో తీవ్ర జాప్యం
- 2024లో పూర్తి కావాల్సిన ప్రాజెక్టు
- నిర్మాణ సంస్థకు డబ్బులు చెల్లించని వైసిపి ప్రభుత్వం
- నేటికీ బిల్లులు క్లియర్ చేయని టిడిపి కూటమి ప్రభుత్వం

నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఒడిశా ప్రభుత్వం అభ్యంతరాలు ఉన్న నేపథ్యంలో వంశధార జలాల వాటాను వాడుకునేందుకు హిరమండలం రిజర్వాయర్ వద్ద ఎత్తిపోతల పథకం నిర్మాణం చేపట్టాలని గత వైసిపి ప్రభుత్వం నిర్ణయించింది. ఆ పథకం పూర్తయితే హిరమండలం రిజర్వాయర్‌లో 12 టిఎంసిల నీటిని నింపొచ్చని తెలిపింది. అందుకనుగుణంగా ఎత్తిపోతల పథకం నిర్మాణానికి రూ.176.35 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లను పిలిచింది. హైదరాబాద్‌కు చెందిన రాఘవయ్య కన్‌స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.140.17 కోట్లతో టెండర్లను దక్కించుకుంది. ఇందుకు సంబంధించి 2023 ఫిబ్రవరి ఆరో తేదీన ఆ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది. దీని ప్రకారం పథకం ఏడాదిలోగా అంటే ఫిబ్రవరి ఆరు, 2024లోగా పూర్తి కావాల్సి ఉంది. ప్రభుత్వం నుంచి మొబిలైజేషన్ లేక, నిర్మాణ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ అనేక కాంట్రాక్టులు చేస్తుండడంతో, 2024 ఫిబ్రవరిలో పనులు మొదలుపెట్టింది. గతేడాది ఫిబ్రవరి నాటికి పనులు పూర్తి కావాల్సి ఉంది. పనులు పూర్తి కాకపోవడంతో, 2026 మార్చి వరకు ఒప్పంద కాలపరిమితిని పొడిగించారు. రెండుసార్లు కాలపరిమితిని పెంచినా ఇప్పటికీ 45 శాతం పనులు మాత్రమే పూర్తి కావడం గమనార్హం.

రూ.30 కోట్ల మేర బిల్లులు పెండింగ్

పనులు ముందుకు సాగకపోవడానికి గత వైసిపి, ప్రస్తుత టిడిపి కూటమి ప్రభుత్వాల తీరే ప్రధాన కారణమన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పథకాన్ని ఘనంగా ప్రారంభించిన నాటి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు, నిర్మాణ సంస్థకు చెల్లింపుల దగ్గరకొచ్చేసరికి ముఖం చాటేసింది. పనులు చేసిన సంబంధిత నిర్మాణ సంస్థకు రూ.30 కోట్ల మేర బకాయిలు చెల్లించలేదని తెలిసింది. గతేడాది జూన్‌లో అధికారంలోకి వచ్చిన టిడిపి కూటమి ప్రభుత్వం ఈ ఎత్తిపోతల పథకం జోలికే వెళ్లలేదు. బడ్జెట్‌లో నిధులూ కేటాయించలేదు. వంశధార అధికారులు పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లడంతో చెల్లింపులు చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో అధికారులు మరోసారి పెండింగ్ బిల్లులను అప్‌లోడ్ చేశారు. మరోవైపు ఎత్తిపోతల పథకానికి అవసరమైన విద్యుత్ సరఫరాకు ఎపి ట్రాన్స్‌కోకు డెవలప్‌మెంట్ ఛార్జీల కింద చెల్లించాల్సిన రూ.9.20 కోట్లనూ ప్రభుత్వం చెల్లించలేదని తెలుస్తోంది.

సకాలంలో పూర్తి కావడంపై సందేహాలు

ప్రభుత్వానికి కొత్త సాగునీటి ప్రాజెక్టులు, పథకాలు ప్రారంభంపై ఉన్న శ్రద్ధ పెండింగ్ ప్రాజెక్టుల పూర్తిపై లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వంశధార ఫేజ్–2 స్టేజ్–2 ప్రాజెక్టు పనులు 2005లో ప్రారంభమయ్యాయి. 20 ఏళ్లు అవుతున్నా నేటికీ రైతులకు అందుబాటులోకి రాలేదు. 87 ప్యాకేజీ పనులు 90 శాతం, 88 ప్యాకేజీ పనులు 94 శాతం, హిరమండలం రిజర్వాయర్ పనులు 94.50 శాతం పనులు జరిగాయి. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ పనులు 2007లో ప్రారంభించారు. 18 ఏళ్లు గడుస్తున్నా ఇప్పటికీ 38 శాతం పనులే చేశారు. వంశధార–నాగావళి అనుసంధాన పనులను 2017లో మొదలుపెట్టారు. ఎనిమిదేళ్లు గడుస్తున్నా 73 శాతం మేర పూర్తయ్యాయి. ప్రభుత్వాలు మారడం, వాటికి అనుకూలంగా ఉన్న నిర్మాణ సంస్థలకు సవరించిన అంచనా వ్యయంతో పనులు అప్పగించడం చేస్తూనే ఉన్నారు. అంతకంతకూ పెరుగుతున్న అంచనా వ్యయంతో ప్రజల డబ్బు వృథా అవుతోంది తప్ప పనులు మాత్రం పూర్తి కావడం లేదు. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఎత్తిపోతల పథకం ఒప్పందం ప్రకారం వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి కావాల్సి ఉంది. పనులు మొదలు పెట్టిన రెండేళ్లలో 45 శాతమే పూర్తయిన నేపథ్యంలో మరో నాలుగు నెలల్లో మిగిలిన పనిని ఏ మేరకు పూర్తి చేయనున్నారో చూడాల్సి ఉంది.



టెక్కలి రూరల్ : కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

పారదర్శకంగా ప్రభుత్వ పథకాల అమలు

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి – శ్రీకాకుళం సిటీ, టెక్కలి రూరల్, పలాస

డివిజన్ స్థాయిలో ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా అమలు చేయాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. జిల్లాలో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలను వర్చువల్ విధానంలో గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో మెరుగైన సేవలు అందించేందుకు డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయాలు ఉపయోగపడతాయన్నారు. డివిజన్ స్థాయిలో సంక్షేమ కార్యక్రమాలు సమీకృతం చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. పారదర్శకంగా సంక్షేమ పథకాలు అమలు చేసే విధంగా అధికారులు ఉండాలన్నారు. ఎలాంటి సిఫార్సులు లేకుండా అధికారులు సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. శిక్షణ సామర్థ్యం పెంచేందుకు శిక్షణా సంస్థలను బలోపేతం చేస్తామన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థను మరింత పటిష్టం చేయడానికి ఐటి విభాగం ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ డివిజన్ స్థాయిలో పర్యవేక్షణకు ఈ కార్యాలయాలు కీలకంగా మారుతుందన్నారు. డివిజనల్ స్థాయిలో డిడిఒ కార్యాలయాలు మినీ కలెక్టరేట్‌గా ఉంటుందన్నారు. డిడిఒ కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మాణాలు చేపట్టాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ అభివృద్ధికి సంబంధించిన అధికారులు డిఎల్‌డిఒ కార్యాలయంలో ఉంటారన్నారు. ఇప్పటికే డిపిఒ కార్యాలయం నుంచి డివిజనల్ పంచాయతీ అధికారిని డిఎల్‌డిఒ కార్యాలయానికి తీసుకొచ్చినట్లు తెలిపారు. డ్వామా కార్యాలయం నుండి ఎపిడి ఉంటారన్నారు. ఎంపిడిఒలతో సమన్వయంతో చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. గ్రామాల్లో పరిపాలన, అభివృద్ధి ప్రజలకు మరింత చేరువ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్, జెడ్‌పి సిఇఒ కిరణ్ కుమార్, డిపిఒ కె.భారతి సౌజన్య, జిల్లా డివిజనల్ అభివృద్ధి అధికారి అరుంధతి దేవి, టెక్కలి ఆర్‌డిఒ కృష్ణమూర్తి, డిడిఒ అలివేలుమంగమ్మ, ఎపిడి ఎం.శైలజ, డిఎల్‌పిఒ రమణ, ఎంపిడిఒలు తదితరులు పాల్గొన్నారు.

పరిపాలన సౌలభ్యం కోసం డిడిఒ కార్యాలయాన్ని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస ఎన్‌ఆర్‌ఇజిఎస్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన డిడిఒ కార్యాలయాన్ని ప్రారంభించారు. పలాస నుంచి ఇచ్ఛాపురం వరకు ఉన్న ప్రజలకు, అధికారులకు సేవలను అందుబాటులో ఉంచేందుకు ప్రభుత్వం డిడిఒ కార్యాలయాన్ని ఏర్పాటు చేసిందన్నారు. కార్యక్రమంలో డిడిఒ బొడ్డేపల్లి శైలజ, ఎంపిడిఒ వసంతకుమార్, మెట్ట వైకుంఠరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, ఎం.నరేంద్ర చిన్ని, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, బి.నాగరాజు, వంకల కూర్మారావు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే



పలాస : ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష



లోకేష్‌కు ఘన స్వాగతం

ప్రజాశక్తి – ఆమదాలవలస, శ్రీకాకుళం, రణస్థలం రూరల్

మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో పాల్గొనేందుకు పార్వతీపురం మన్యం జిల్లా భామినికి వెళ్తున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌కు టిడిపి శ్రేణులు గురువారం ఘన స్వాగతం పలికాయి. జిల్లా ముఖద్వారం అయిన పైడిభీమవరం వద్ద ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు, కూటమి నాయకులు పెద్దసంఖ్యలో చేరుకుని మంత్రికి స్వాగతం పలికారు. శ్రీకాకుళం సమీపంలోని కొత్తరోడ్డు ఫ్లైఓవర్ వద్దకు వచ్చిన మంత్రికి శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, నాయకులు స్వాగతం పలికారు. శ్రీకాకుళం నుంచి పాలకొండ మీదుగా భామిని వెళ్లే క్రమంలో ఆమదాలవలస పట్టణంలోని పారిశ్రామికవాడ వద్ద గల ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద వేచి ఉన్న ప్రజలను గమనించి మంత్రి కాన్వాయ్‌ను ఆపారు. టిడిపి నాయకులు, మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మొదలవలస రమేష్, తమ్మినేని చంద్రశేఖర్, నూక రాజు తదితరులు పుష్పగుచ్ఛాలతో ఘన స్వాగతం పలకగా, ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత తదితరులు తిలకం దిద్ది హారతులు ఇచ్చారు. పలువురు సమస్యలపై అర్జీలను మంత్రి లోకేష్‌కు అందించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు, టిడిపి నాయకులు సనపల ఢిల్లీశ్వరరావు, తమ్మినేని అప్పలనాయుడు, నేతింటి జ్యోతి, కోట శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : కొత్తూరు మండల కేంద్రంలో లోకేష్ కోసం టిడిపి నాయకులు గంటల తరబడి ఎదురు చూశారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవింద రావు మంత్రికి గజమాలతో ఘన స్వాగతం పలికేందుకు సిద్ధం కాగా, గజమాలను వేసుకోకుండా మంత్రి వెళ్లిపోయారు. దీంతో నాయకులు నిరాశకు గురయ్యారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు, టిడిపి మండల అధ్యక్షులు అగతముడి మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి – టెక్కలి రూరల్

రైతులు ఇప్పుడు గుర్తొచ్చారా..?

- అబద్ధాలకు జగన్ అంబాసిడర్
- వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

అధికారం పోయేసరికి వైఎస్ జగన్‌కు రైతులు గుర్తొచ్చారా అని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. టెక్కలి పట్టణంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐదేళ్ల పాటు జగన్ నడిపిన తుగ్లక్ పరిపాలనే వ్యవసాయ రంగాన్ని దెబ్బతీయడానికి ప్రధాన కారణమని ఆరోపించారు. ఆ వైఫల్యాలను దాచిపెట్టేందుకు ఇప్పుడు అబద్ధాలకు అంబాసిడర్‌లా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ప్రస్తుతం రాష్ట్రంలో రైతులకు ప్రభుత్వం అందిస్తున్న మద్దతు, పంట కొనుగోళ్ల వేగం, తక్షణ సహాయ చర్యలను వక్రీకరించి ప్రజల్లో గందరగోళం సృష్టించడం జగన్‌కు అలవాటైపోయిందన్నారు. జగన్ చేస్తున్న బాధ్యతారహిత ఆరోపణలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రైతుల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న ప్రతి నిర్ణయం పారదర్శకంగా, శాస్త్రీయంగా ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వం వ్యవసాయం, వ్యవసాయాధారిత రంగాలను దేశంలోనే ఆదర్శంగా నిలిపేలా పునరుజ్జీవింపజేస్తోందని చెప్పారు. రైతులకు తక్షణ మార్కెట్ జోక్యం అందించేందుకు 2025–26 బడ్జెట్‌లోనే రూ.300 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని, అవసరాన్ని బట్టి ఇప్పటికే రూ.800 కోట్లకు పైగా మద్దతు ధరల రూపంలో ఖర్చు చేసిందని వివరించారు. మిర్చి, పొగాకు, మామిడి, కోకో, ఉల్లి, టమాటా ధరలు పడిపోయినప్పుడు రైతుల పక్షాన నిలిచింది కూటమి ప్రభుత్వం మాత్రమేనన్నారు. ఈ–పంట నమోదు శత శాతం చేశామన్నారు. గత ప్రభుత్వ పాలనలో రైతుల ధాన్యం బకాయిలు రూ.1674 కోట్లు కూటమి ప్రభుత్వం వచ్చాక చెల్లించిందని తెలిపారు. వైసిపి హయాంలో ఒక ఏడాదిలో 7.15 లక్షల మంది రైతుల నుంచి మాత్రమే ధాన్యం సేకరించగా, కూటమి ప్రభుత్వం గతేడాది 7.68 లక్షల రైతుల నుంచి ధాన్యం సేకరించిందన్నారు. ఉచిత పంటల బీమా పథకం కింద రాష్ట్ర ప్రభుత్వ, రైతు చెల్లించాల్సిన వాటా.. రెండిటినీ చెల్లిస్తానని అబద్ధపు హామీలు ఇచ్చి, అసలు ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించకుండా ఎగవేసి రైతులను నట్టేట ముంచారని ధ్వజమెత్తారు. వ్యవసాయానికి గత ప్రభుత్వం, కూటమి ప్రభుత్వం ఏం చేశాయో బహిరంగ చర్చకు జగన్ సిద్ధమా అని సవాల్ విసిరారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయ సందర్శన

టెక్కలి కేంద్రంలోని వైభవ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని మంత్రి అచ్చెన్నాయుడు దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధి అంశాలపై రెవెన్యూ, పంచాయతీరాజ్ అధికారులు, ఆలయ కమిటీతో సమావేశం నిర్వహించారు. వైకుంఠ ఏకాదశి నాటికి రక్షణ గోడ నిర్మాణం పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సందర్శకులకు మెరుగైన సేవలందించేందుకు అవసరమైన సౌకర్యాల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఆలయ పరిసరాల శుభ్రత, సుందరీకరణ అంశాలపై పలు సూచనలు చేశారు. పట్టు మహదేవ్ కోనేరు గట్టు చుట్టుపక్కల ప్రహరీ పనులను పరిశీలించారు. కార్యక్రమంలో అధికారులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

నేడు మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం

టెక్కలి: విద్యాశాఖ ఆధ్వర్యాన ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని నిర్వహించనున్నారు. సందడి వాతావరణం మధ్య మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాన్ని చేపట్టాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. జిల్లాలోని 1195 ప్రాథమిక, 315 ప్రాథమికోన్నత, 419 ఉన్నత, 25 కెజిబివి పాఠశాలల్లో ఈ సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి వారం రోజులుగా విద్యాశాఖ చేసిన కసరత్తుతో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సిద్ధమయ్యారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఇప్పటివరకు పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలతో పాటు విద్యార్థుల చదువులు ఎలా ఉన్నాయి, తీసుకోవాల్సిన చర్యలు వంటి విషయాలను సమావేశంలో చర్చించనున్నారు. ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన మెగా డిఎస్‌సిలో మంజూరైన ఉపాధ్యాయుల పోస్టుల పైనా సమావేశంలో వివరించనున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధిపై చేస్తున్న కృషిని తల్లిదండ్రులకు తెలియజేయనున్నారు. పాఠశాలలకు విద్యా బోధకుల నియామకాలు చేపడుతున్న విషయంపై చర్చించనున్నారు. సమావేశానికి హాజరయ్యే విద్యార్థుల తల్లిదండ్రులకూ మధ్యాహ్న భోజన సదుపాయాన్ని కల్పించారు. సమావేశ నిర్వహణకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 30 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలకు రూ.900 నిధులు మంజూరు చేయగా 100 నుంచి 200 వరకు ఉన్న విద్యార్థులున్న పాఠశాలలకు రూ.4,500 చొప్పున మంజూరు చేసింది. ఈ నిధుల్ని సంబంధిత మండల విద్యాశాఖ అధికారి వారి ద్వారా విడుదల చేయనున్నారు.

ట్రిపుల్ ఐటిలో ఇంటర్ క్యాంపస్ క్రీడా సంరంభం

ప్రజాశక్తి – ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ఐఐఐటి) పరిధిలోని నాలుగు క్యాంపస్‌ల విద్యార్థుల కోసం ప్రతిష్టాత్మకమైన 'ఇంటర్ క్యాంపస్ స్పోర్ట్స్ టోర్నమెంట్' శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి ప్రాంగణంలో గురువారం ఘనంగా ప్రారంభమైంది. శ్రీకాకుళం స్పోర్ట్స్ బోర్డు, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం సంయుక్త ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఈ మెగా టోర్నమెంట్‌ను యూనివర్సిటీ డైరెక్టర్ కె.వెంకట ధనబాలాజీ లాంఛనంగా ప్రారంభించారు. మూడు రోజుల నిర్వహించనున్న వాలీబాల్, చెస్ వంటి పలు క్రీడా పోటీల్లో ఆర్.కె వ్యాలీ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి ప్రాంగణాల విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పరిపాలనా అధికారి ముని రామకృష్ణ, డీన్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ రవి, స్పోర్ట్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు దిలీప్ కుమార్, కృష్ణంరాజు పాల్గొన్నారు.



క్రీడాకారులతో ట్రిపుల్ ఐటి డైరెక్టర్ బాలాజీ

కుక్కల దాడిలో ఐదు మేక పిల్లలు మృతి

- కొంచాడలో ఒక్కరోజు వ్యవధిలో మరో ఘటన
- ఆందోళనలో గొర్రెలు, మేకల పెంపకందారులు

ప్రజాశక్తి – పొందూరు

మండలంలోని కొంచాడలో కుక్కల గుంపు దాడిలో 40 గొర్రె పిల్లలు మృతి చెందిన విషయం మరువక ముందే ఒక్కరోజు వ్యవధిలోనే గురువారం అదే గ్రామంలో మరోచోట ఐదు మేక పిల్లలు మృతి చెందగా, ఏడు మేక పిల్లలు గాయపడ్డాయి. గ్రామానికి చెందిన పల్ల సింహాచలంకు చెందిన శాలలో ఎవరూ లేని సమయంలో ఒక్కసారిగా మేకపిల్లలపై కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. తీవ్రంగా గాయపడిన మేకలు క్షణాల వ్యవధిలో మృతి చెందాయి. స్థానికులు గమనించి పరుగున వచ్చేసరికి కుక్కలు పారిపోయాయి. శాల నుంచి ఇంటికి వెళ్లిన కొద్దిసేపటికే కుక్కల గుంపు దాడితో మేకలు మృత్యువాత పడ్డాయని బాధితులు కన్నీటిపర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న పశుసంవర్ధకశాఖ ఎడి రఘునాథ్, పశువైద్యాధికారులు హేమంత్, ఇందిర వచ్చి గాయపడిన మేక పిల్లలకు చికిత్స అందించారు. పశువైద్యాధికారులు మృతి చెందిన మేకలకు పోస్టుమార్టం నిర్వహించారు. తహసీల్దార్ ఆర్.వెంకటేష్‌కు అధికారులు సమాచారం అందించారు. గొర్రెల పెంపకందారుల సంఘం అధ్యక్షులు కుజ్జు తాతయ్య, బిసి యాదవ సంక్షేమ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వరరావు యాదవ్, బిసి సంఘం సభ్యులు నాగళ్ల మురళీ, మాజీ సర్పంచ్ ముగడ తవిటినాయుడు బాధితులను పరామర్శించారు.



పరిశీలిస్తున్న పశుసంవర్ధకశాఖ ఎడి రఘునాథ్

ఒక్కరోజు వ్యవధిలోనే...

ఒక్కరోజు వ్యవధిలోనే రెండు చోట్ల కుక్కల గుంపు దాడులతో గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. గ్రామంలో సుమారు 200 కుటుంబాలు గొర్రెలు, మేకలు పెంపకం పైనే ఆధారపడి జీవిస్తున్నాయి. రెండు రోజులుగా చోటుచేసుకుంటున్న సంఘటనలతో పెంపకందారులు బెంబేలెత్తిపోతున్నారు. కుక్కలు దాడులకు అలవాటు పడడంతో పెంపకందారులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.

డిగ్రీ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి– విజయనగరం

శ్రీకాకుళం జిల్లా గార మండలం తోనంగికి చెందిన కె.స్వాతి ఎంఆర్ అటానమస్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం బిజెడ్‌సి గ్రూపు చదువుతోంది. విజయనగరంలోని అయ్య కోనేరు గట్టు సమీపంలో ఉన్న బిసి సంక్షేమ శాఖ కళాశాల వసతిగృహంలో ఉంటోంది. రోజూ కళాశాలకు వెళ్లి వస్తూ హాస్టల్‌లో ఉంటోంది. ఇటీవల కాలంలో ఆమెకు కడుపునొప్పితో పాటు పలు అనారోగ్య కారణాలు చుట్టుముట్టడంతో మందులు వాడుతోంది. గురువారం ఉదయం అనారోగ్యంగా ఉందని కళాశాలకు వెళ్లనని హాస్టల్ వార్డెన్ కృష్ణవేణికి తెలిపింది. హాస్టల్ గదిలో ఐదుగురు విద్యార్థులు ఉండగా మిగతా నలుగురు విద్యార్థులూ కళాశాలకు వెళ్లిపోయారు. ఈనేపథ్యంలో స్వాతి తన గదిలో ఫ్యాన్‌కు చెన్నీతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మధ్యాహ్నం భోజనానికి హాస్టల్‌కు వచ్చిన విద్యార్థులు గది దగ్గరకు వచ్చేసరికి తెలుపులు వేసి ఉన్నాయి. వెంటనే విద్యార్థులు తలుపు కొట్టినా తీయకపోవడంతో అనుమానం వచ్చి కిటికీలోనుంచి చూశారు. ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించడంతో విద్యార్థులు హాస్టల్ వార్డెన్‌కు సమాచారం అందించారు. వార్డెన్ కృష్ణవేణి, విద్యార్థులు మృతదేహాన్ని కిందకి దించి చూసేసరికి మృతి చెందింది. విజయనగరం టూటౌన్ పోలీసులకు సమాచారం అందించడంతో సిఐ టి.శ్రీనివాసరావు, ఎస్ఐ కనకరాజు, సిబ్బంది సంఘస్థలానికి చేరుకొని పరిశీలించారు. క్లూస్‌టీమ్, ఫింగర ప్రింట్స్ సిబ్బంది సిఐ బి.మురళీమోహన్‌రావు ఆధ్వర్యాన పరిశీలించారు.



నా మృతికి ఎవరూ కారణం కాదు

'నా మృతికి ఎవరూ కారణం కాదని స్వాతి లేఖ రాసింది. తల్లిదండ్రులు బాధపడవద్దు అని ఆ లేఖలో పేర్కొన్నట్లు తెలిసింది. తన చావుకు ఎవరూ కారణం కాదని, అనారోగ్యం వల్లే ఆత్మహత్యకు పాల్పడుతున్నానని లేఖలో పేర్కొనట్లు తెలిసింది.

IN THE HONOURABLE COURT OF THE CIVIL JUDGE (JUNIOR DIVISION) AT PATHAPATNAM.
E.P: No: 2/2025 in O.S: No: 43/2024

Between:
Gonti Indra Sena Rao -----DHR
And:-
Mula Bhaskara Rao -----JDR

NOTICE

To,
Mula Bhaskara Rao, S/o Mallesu, age 45 Years, Bejji Village, Saravakota Mandal, Srikakulam Dist.

Please take notice in the above matter the DHR (Decre Holder) Filed EP.2/2025 against you for attachment of House property and the same was Stand Posted on **08-12-2025** for your apperance. on that day **at 10.30 AM.,** either to person to an advocate failing which the matter will be heard and Ex-party in your absence.

// By Court Order //

P. SAI RAJU
P. A. NAIDU
ADVOCATES, PATHAPATNAM,
SRIKAKULAM DIST,
CELL: 9885942150.

ORDER 21 RULE 64 OF CPC
IN THE HONOURABLE COURT OF THE III ADDITIONAL DISTRICT JUDGE CUM FAMILY COURT AT SRIKAKULAM
E.P. NO. 307/2024 IN ARC. NO. G104135318

BETWEEN:
APAC Financial Services Pvt. Ltd.,Srikakulam, represented by its Authorized Person
...Decree Holder
AND
1. Sativada Rambabu
2. Sativada Parvathi w/o Rambabu
... Judgment Debtors

To
JDR No.1 & 2: Sativada Rambabu & Sativada Parvathi, Both are having same address: D.No. 1-331, Ajjaram Village Etcherla Mandal Srikakulam District, Andhra Pradesh – 532408

NOTICE

Take notice that the above EP is posted for your notice and you are hereby directed to appear before the Honourable Court of the III Additional District Judge cum Family Court, Srikakulam on **22.12.2025** at **10:30** A.M. either personally or through your Advocate. If you fail to appear, the matter will be decided exparte..


ADVOCATE FOR THE DECREE HOLDER
CHINTAPALLI SURYANARAYANA
Advocate,
Srikakulam. Cell: 96767 30547


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

మహాసభలను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- మందస

విశాఖపట్నం ఈ నెల 31 నుంచి వచ్చే 4 వరకు నిర్వహించనున్న సిఐటియు అఖిలభారత 18వ మహాసభలను విజయవంతం చేయాలని సిఐటియు మండల కన్వీనర్, కో-కన్వీనర్ కె.కేశవరావు, పి.దేవేంద్ర పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం మందసలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీడి, రైస్ మిల్ కార్మికులు, హమాలీలు తీవ్రమైన శ్రమదోపిడికి గురవుతున్నారని అన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ, బోనస్ గ్రాడ్యుటీ వంటి కార్మిక చట్టాలను యాజమాన్యాల అమలు చేయడం లేదని పేర్కొన్నారు. కార్మికులకు భద్రత కరువైందన్నారు. అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజన పథకం తదితర స్కీమ్ వర్కర్స్ వంటి కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఐక్య పోరాటాల ద్వారా మన హక్కులు సాధించుకోవచ్చని పిలుపునిచ్చారు. అందుకోసం కార్మిక సమస్యలు పరిష్కారానికి పోరాటాలు రూపకల్పనకు మహాసభ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి ఎం.ధర్మా రావు, సిఐటియు నాయకులు ఎస్.వల్లభ, మూర్తి, బి.చిన్నోడు పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

రణస్థలం రూరల్: రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకుని మద్దతు ధర పొందాలని, ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు స్పష్టం చేశారు. మండలంలోని సంచాంలో రైతుసేవా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సేవ కోసం, వారికి అవసరమైన అన్ని వ్యవసాయ సదుపాయాలు, సహాయం ఒకే చోట లభించేలా ప్రభుత్వం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసిందని, దీని ద్వారా రైతులకు మరింత సౌలభ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్ పర్సన్ దంతులూరి సుశీలవర్మ, మాజీ సర్పంచ్ కోరాడ వెంకట రమణ, పిషిని జగన్నాథం నాయుడు, పిన్నింటి భానోజీనాయుడు, డిజిఎం ఆనందరావు, బాలి శ్రీను, గొర్లె శ్రీహరి, కోట్ల ఈశ్వరరావు, లంక ప్రభ, శ్రీనివాసరావు, మహంతి అనంత్, మీసాల గిరి, తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఎంపిడిఒ ఈశ్వరరావు, ఏడీ వడ్డాది శ్రీనివాసరావు, ఎఒ డి.విజయభాస్కర్, పిఎసిఎస్ సిఇఒ గిరి బుచ్చి రంగనాథ్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ధర్నా చేస్తున్న పౌర హక్కుల సంఘం నాయకులు

కళాశాలను కాపాడుకుందాం

మందస: ప్రభుత్వ జూనియర్ కళాశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని పౌర హక్కుల సంఘం జిల్లా అధ్యక్షులు పత్రి దానేష్ పిలుపునిచ్చారు. 16 ఏళ్లుగా ఆలయ ట్రస్టు యాజమాన్యం భూములను రైతులకు కౌలుకు ఇచ్చారని అన్నారు. ఈ సమయంలో భూమిని స్వాధీనం చేసుకునోవాలని ట్రస్టు సభ్యులు కోర్టులో కేసు వేశారు. దీనికి నిరసనగా గురువారం ధర్నా చేశారు. మందస పట్టణంలో 1981-82లో నిర్మించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రస్తు తన ఉనికినే కోల్పోయే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. చదువు, జ్ఞానం అవసరాన్ని ప్రజలు గుర్తించి నిర్మించుకున్న కళాశాల ప్రైవేటు శక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్న పరిస్థితులు ఉన్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం కార్యదర్శి సోమనాదం, పిట్ట జోగారావు, పోతనపల్లి వైకుంఠరావు, డొక్కరు దానయ్య, బోనీల రామారావు, మహిళా సంఘ నాయకులు నాగమణి పాల్గొన్నారు.



ఎంఇఒలకు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

సిఆర్‌ఎంటిలను రెగ్యులర్ చేయాలి

బూర్జ: రాష్ట్ర సిఆర్‌ఎంటి యూనియన్ ప్రతినిధుల పిలుపుమేరకు గురువారం స్థానిక ఎంఇఒలకు సిఆర్‌ఎంటి సమస్యలపై జిల్లా నాయకులు ముంజి మల్లేశ్వరరావు, అల్లు వెంకట అప్పలనాయుడులు వినతిపత్రం అందజేశారు. సిఆర్‌ఎంటిలను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని, ఫీల్డ్ లెవెల్‌లో పనిచేస్తున్నందున ట్రావెలింగ్ ఆలవెన్స్‌లను పునరుద్ధించాలని పేర్కొన్నారు. అలాగే ఇతర ఉద్యోగులకు వర్తించే పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు కల్పించాలన్నారు. సిఆర్‌ఎంటిలు ఎవరైనా అనారోగ్య, ప్రమాదవశాత్తు మరణిస్తే వారి కుటుంబాల్లో ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, గత ఆరు సంవత్సరాలుగా జీతాలు పెంచకపోవడం వలన తక్షణమే జీతాలు పెంచాలని కోరారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సిఆర్‌టిలు బెజ్జిపురపు జనార్ధనరావు, వై.వి.ఎం మూర్తి తదితరులున్నారు.

దరఖాస్తుల స్వీకరణ

పొందూరు: మండల పరిధిలో ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం కింద గృహ నిర్మాణాలకు 3,224 దరఖాస్తులను స్వీకరించినట్లు గృహ నిర్మాణశాఖ ఎఇ డి. బాబూరావు తెలిపారు. పొందూరు గృహనిర్మాణ కార్యాలయంలో పిఎంఎవై 2.0పై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ధరఖాస్తుల స్వీకరణకు గడువు ముగిసిందని, ఇప్పటికే స్వీకరించిన దరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు చేసేందుకు ఈ నెల 14 వరకు మాత్రమే అవకాశం ఉందన్నారు. ఈ ధరఖాస్తుల్లో మార్పులు, చేర్పులు గృహనిర్మాణశాఖ పీడీ, ఎఇ లాగిన్‌లో మాత్రమే చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. మండలంలో మొత్తం 3,224 దరఖాస్తుల్లో స్థలం లేనివాళ్లు 1,274 మంది, స్థలం ఉండి కేవలం ఇంటి నిర్మాణం కోసం 1,950 మంది దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.


సమీక్ష నిర్వహిస్తున్న ఎఇ బాబూరావు

యుటిఎఫ్ మండల కార్యవర్గం ఏకగ్రీవం

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

సంతబొమ్మాళి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో గురువారం నిర్వహించిన యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షునిగా కానూరు ఆనందరావు, అధ్యక్షునిగా యర్నాగుల సింహాచలం, సహాధ్యక్షులుగా సుంకు రాజ్‌కుమార్, చదువుల మాలతి, ప్రధాన కార్యదర్శిగా గౌడు మోహనరావు, కోశాధికారిగా మూల రమణ ఎంపికయ్యారు. అలాగే ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బడగల వెంకటగిరి, మహిళా కమిటీ కన్వీనర్‌గా దుంగ జయలక్ష్మి, సిపిఎస్ కమిటీకి వంజరాపు సీతంనాయుడు, అకడమిక్ సెల్‌కు సడగాన గురునాథ్ నియమితులయ్యారు. దేవాది గణపతిరావు, కుసుమూరు పాపారావు తదితరులు జిల్లా కౌన్సిలర్లుగా ఎన్నుకున్నారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, సంఘ బలోపేతానికి కొత్త కమిటీ చురుగ్గా పని చేస్తుందని యుటిఎఫ్ నాయకులు తెలిపారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

యుటిఎఫ్ అధ్యక్షునిగా జయరాం

పలాస : కాశీబుగ్గ ఉన్నత పాఠశాల ఆవరణలో యుటిఎఫ్ మండల అధ్యక్షుడుగా తమ్మినేని జయరాం, ప్రధాన కార్యదర్శిగా సీపాన వెంకటరమణను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కంచరానా రమేష్, రాష్ట్ర కార్యదర్శి సంపత్‌రావు కిషోర్ కుమార్, రాష్ట్ర కౌన్సిలర్ బల్ల చిట్టిబాబు, రాష్ట్ర అడ్వైయిజర్ కమిటీ మెంబర్ గుంట కోదండరావు, జిల్లా అకడమిక్ సెల్ కన్వీనర్ లఖినాన వెంకటాచలం ఆధ్వర్యాన ఎన్నిక నిర్వహించారు. గౌరవాధ్యక్షునిగా టి.అప్పారావు, నూతన అధ్యక్షునిగా తమ్మినేని జయరాం, ప్రధాన కార్యదర్శిగా సీపాన వెంకట రమణ, కోశాధికారిగా కె.గోపి, సహాధ్యక్షులుగా ఎం.సంతోష్ కుమార్, బెండి లక్ష్మి, ఆడిట్ కమిటీ మెంబర్ గోవింద రాజులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు వీరితోపాటు పది మంది మండల కార్యదర్శులను, మరో పది మంది జిల్లా కౌన్సిలర్లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఉప్పాడ రమేష్, జి.మధు, ఢిల్లేశ్వరరావు, మండల ఉపాధ్యాయులు డి.శరత్ బాబు, లక్ష్మణరావు, నాగేశ్వరరావు, మన్మథరావు పాల్గొన్నారు.

పలాసను జిల్లాగా ప్రకటించాలి

పోలీసుల ఆంక్షల నడుమ సమావేశం

ప్రజాశక్తి- పలాస

ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాలను కలుపుతూ మధ్యలో ఉన్న పలాసను జిల్లా కేంద్రంగా ప్రకటించాలని న్యాయవాది, పలాస జిల్లా సాధన జెఎసి నాయకులు దువ్వాడ శ్రీధర్ అన్నారు. కాశీబుగ్గ ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ ఎదురుగా శ్రీధర్ అధ్యక్షతన 'పలాస జిల్లా కేంద్రంగా డిమాండ్' అనే అంశంపై మేధావులతో సమావేశం నిర్వహించారు. సమావేశంపై పోలీసులు ఆంక్షలు విధించినా ఆంక్షలు నడుమ సమావేశం కొనసాగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కేంద్రంగా పలాసను ప్రకటిస్తే... ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి సాధిస్తుందన్నారు. అలాగే నిరుద్యోగ యువకులకు ఉపాధి అవకాశాలూ మెరుగుపడతాయని అన్నారు. భౌగోళికంగా, ఆర్థిక పరంగా, ప్రకృతి వనరుల రీత్యా పలాస జిల్లా ఏర్పాటుకు ఎంతో అనువైన ప్రాంతమని అన్నారు. ఉద్దానం, విశాలమైన గిరిజన ప్రాంతం, సముద్ర తీరం, ఒడిశాను ఆనుకుని సరిహద్దు, మూలపేట భావనపాడు హార్బర్, పలాస రైల్వే స్టేషన్, విశాలమైన జాతీయ రహదారి ఇలా ఎటు చూసినా పలాసను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు అన్ని విధాలుగా అర్హతలు కలిగి ఉందన్నారు. దీనిపై పాలకులు పునరాలోచించాలని కోరారు. కార్యక్రమంలో ఎఐసిసి ఒబిసి విభాగపు కో-ఆర్డినేటర్ డాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు వంకల మాధవరావు, ఎన్‌జిఒ సంఘం అధ్యక్షులు బోనెల గోపాల్, వరిశ హరిప్రసాద్, ఎపిడబ్ల్యుజెయు సభ్యులు దనేశ్వర మహారాణ, న్యాయవాది కామేశ్వరరావు పట్నాయక్, కుమార్ నాయక్, గుంట కామయ్య పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న జిల్లా సాధన జెఎసి నాయకులు


పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

సొంత కృషి... సేంద్రియ సిరి

కవిటి: 'కృషితో నాస్తి దుర్భిక్షం' ఈ మాటను నిజం చేస్తూ కవిటికి చెందిన రైతు ఆరింగి త్రివిక్రమరావు (రాజు) ప్రకృతి వ్యవసాయంలో నిదర్శనంగా నిలుస్తున్నారు. రసాయనాలు లేని పంట ఆరోగ్యానికి మేలని ధాన్యం దిగుబడుల్లోనూ తగ్గేదేలే అని నిరూపిస్తున్నారు. గత పదేళ్లుగా రెండున్నర ఎకరాల సొంత పొలం సంపూర్ణ సేంద్రియ పద్ధతిలో సాగుచేస్తున్న ఆయన ఈ ఏడాది రెండు ఎకరాల్లో ఆర్‌జిఎల్, అర ఎకరంలో 1318 వరి రకాలను పండించారు. ప్రస్తుతం పచ్చగా పరవళ్లు తొక్కుతున్న ఆ పంట చూపరులను మంత్రముగ్ధులను చేస్తోంది. బుధవారం సాయంత్రం పంటను పరిశీలించిన ఎపి భవానీశంకర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అంటే ఊహ కాదు... వాస్తవం. నాణ్యమైన పంట, మెరుగైన దిగుబడులను సాధించి రైతు ఆరింగి రాజు సాధించి చూపుతున్నారు. మండల రైతులకు ఆయన ఆదర్శమని అన్నారు. ఎఒ శ్రీదేవి మాట్లాడుతూ సేంద్రియ సాగుతో విజయం సాధించిన రైతును అభినందించారు. ఈ సందర్భంగా ఎఇఒ బెండాల శ్రీకాంత్, రైతులు బెండాల రమేష్, సురేష్, ఆరింగి మధు, తెప్పల మోహనరావు, డిఎంఎంటి జాడు తులసయ్య పాల్గొన్నారు.

రోడ్డు పనులకు శంకుస్థాపన

మెళియాపుట్టి: మండలంలోని బాణాపురం పంచాయతీలోని భగడలో పంచాయతీ నిధులతో సిసి రోడ్డు పనులను సర్పంచ్ పెద్దింటి చంద్రరావు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.


సిఎం సహాయనిధి చెక్కును అందజేస్తున్న ప్రమీల

సిఎం సహాయనిధి చెక్కు అందజేత

పొందూరు: మండలంలోని కృష్ణాపురంలో అనారోగ్యంతో బాధపడుతున్న అంబటి రామారావుకు సిఎం సహాయనిధి నుంచి వచ్చిన రూ.5 లక్షల చెక్కును గురువారం ఎమ్మెల్యే సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల అందజేశారు. కొంతకాలంగా బ్రెయిన్‌కు సంబంధించిన వ్యాధితో బాధ పడుతున్న ఈయనకు చికిత్స కొరకు సుమారు రూ.12 లక్షలవరకూ ఖర్చవ్వగా సిఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా వచ్చిన రూ.5 లక్షల చెక్కు అందజేశారు. ఈమెతో పాటు సర్పంచ్ ప్రతినిధి అంబల్ల శ్రీనివాసరావు, జనసేన జిల్లా కార్యనిర్వాహణ కమిటీ సభ్యులు గార బాబూరావు, కూటమి నాయకులు గార లక్ష్మణ రావు, కెల్ల దాలినాయుడు, కెల్ల పైడినాయుడు, పి.బాల కృష్ణ, జి.శ్రీనివాసరావు, వి.రామారావు, జి.గురునాథం ఉన్నారు.


చిత్రలేఖనం విజేతలతో నిర్వాహకులు

విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పట్టణంలోని సన్‌షైన్ పాఠశాలలో విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. 89 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో 52 మంది బంగారు పతకాలు, 22 మంది వెండి పతకాలు, 15 మంది కాంస్య పతకాలు సాధించారు. ప్రిన్సిపల్, కరస్పాండెంట్ ఆధ్వర్యంలోని యాజమాన్యం బహుమతులు ప్రధానం చేశారు. ఈ పోటీల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


ఆహార పొట్లాలను పంపిణీ చేస్తున్న వెంకటేష్

నిస్సహాయులకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి- ఆమదాలవలస

కృత్విక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పట్టణంలోని లెప్రసీ కాలనీలో అన్నార్తులకు ఆహారాన్ని కృత్విక్ ఫౌండేషన్ చైర్మన్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) చేతులమీదుగా గురువారం పంపిణీ చేశారు. మండలంలోని శ్రీహరిపురానికి చెందిన చింతాడ రవికుమార్, నీరజ దంపతుల కుమార్తె మాన్విత జన్మదినం సందర్భంగా ఈసేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 40 మంది వృద్ధులు, వికలాంగులు, అనాధలకు ఆహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ తమ జన్మదినం, ఇతర కార్యక్రమాల సందర్భంగా ఇటువంటి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. ప్రతి ఏడాది ఫౌండేషన్ తరపున రక్తదాన శిబిరాలు, ఆహార పంపిణీలు వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో బైరి రాము, లింగుబేరి ఆనంద్, బొడ్డేపల్లి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మెరుగైన వైద్యంతో నిలిచిన బాలుని ప్రాణం

ప్రజాశక్తి- శ్రీకాకుళం

కోటబొమ్మాళికి చెందిన 9 ఏళ్ల బాలుడు చెరువులో పడిపోయాడు. దీంతో గ్రామస్తులు బయటకు తీయగా స్పృహలో లేకపోవడంతో కృత్రిమ శ్వాస అందించి సిపిఆర్ చేశారు. అనంతరం శ్రీకాకుళంలోని మెడికవర్ ఆస్పత్రికి తరలించారు. బాలుడు ఆస్పత్రికి వచ్చేసరికి ఎటువంటి స్పర్శ లేకుండా, హార్ట్ రేట్ చాలా తక్కువగా ఉండడం, ఫిట్స్ వస్తుండడంతో బాబుకు వెంటనే కృత్రిమ శ్వాస అందించడంతో పాటు ఊపిరితిత్తులు పూర్తిగా నీటిలో మునిగిపోవడంతో ఊపిరితిత్తులు మొత్తం మట్టి చేరడం వలన కృత్రిమ శ్వాస కూడా కష్టమైనప్పటికీ స్పెషల్ వెంటిలేటరీ స్ట్రాటజీస్‌తో వైద్యం అందించి సకాలంలో ఫిట్స్‌ను గమనించి బ్రెయిన్‌కి థెరప్యూటిక్ హైపోథర్మియా చికిత్సను అందించారు. కిడ్నీ ఫెయిల్యూర్‌ను సకాలంలో గుర్తించి సరైన వైద్యాన్ని అందించినట్టు కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఇంటెన్సివిస్ట్ డాక్టర్ శ్రీరంగ మొదలవలస తెలిపారు. బాలుడు తల్లితండ్రులు, బంధుమిత్రులు డాక్టర్‌ను, ఆస్పత్రి సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.


బాలునితో వైద్యులు

డిప్యూటీ ఎంపిడిఒగా శాంతకుమారి

సోంపేట : సోంపేట గ్రామ పంచాయతీ ఇఒగా పనిచేస్తున్న ఎం.శాంతకుమారి ఉద్యోగోన్నతిపై డిప్యూటీ ఎంపిడిఒగా గురువారం బాధ్యతలు స్వీకరించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇఒగా పనిచేసిన చోటనే ఉద్యోగోన్నతి లభించడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా బాధ్యతల స్వీకరించిన ఆమెకు కార్యాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.


శాంతకుమారి

రేపు రణస్థలం సర్వసభ్య సమావేశం

రణస్థలం: స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఉదయం 11 గంటలకు ఎంపిపి పిన్నింటి రజని అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ ఎం.ఈశ్వరరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు శాఖల వారీగా నివేదికలతో హాజరు కావాలన్నారు. అలాగే మండలంలోని ఎంపిటిసిలు, సర్పంచ్‌లు, జెడ్‌పిటిసి, కో-ఆప్షన్ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు హాజరు కావాలని కోరారు. అలాగే పలు శాఖలకు చెందిన అధికారులు సమావేశానికి హజరు కాకుండా సిబ్బందిని పంపిస్తున్నారని, సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారని అధికారులు తప్పనిసరిగా హజరు కావాలని తెలిపారు.

సిసి రహదారి పనులు ప్రారంభం

ఎచ్చెర్ల: మండలం ఫరీదుపేటలో మండల పరిషత్ నిధులు రూ.4 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సిసి రహదారి, కాలువల నిర్మాణ పనులను ఎంపిపి మొదలవలస చిరంజీవి గురువారం ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గుత్తేదారులు రోడ్డు నిర్మాణంలో నిబంధనలకు అనుగుణంగా పనులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు మొదలవలస కృష్ణ, సతీష్, సీపాన వెంకటరావు, దిలీప్, కూన కిరణ్, పైడి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

పలాస : మండలంలోని గరుడఖండిలో గర్భిణులకు, బాలింతలకు కూటమి నాయకులు గురువారం పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారానికి సక్రమంగా పంపిణీ చేయాలని అంగన్వాడీ కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రామారావు, యెదల్లా నాయకరావు, సాసుమన సంతోష్‌కుమార్, హేమ సుందర్, సీతారాం తదితరులు పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్‌మేళా

కవిటి: కవిటిలో ఎస్‌విజె విద్యా సంస్థల్లో ఈ నెల 6న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్య అధికారి వి.సాయికుమార్, కరస్పాండెంట్ బెందాళం కింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎపి స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యాన నిర్వహించనున్న ఈ జాబ్‌మేళాలో రాష్ట్రంలో పేరు పొందిన 18 కంపెనీలు పాల్గొంటాయని వారు తెలిపారు. అర్హులైన నిరుద్యోగ యువతీ యువకులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

కవిటి: మండలంలోని బొరివంక సబ్ స్టేషన్ పరిధిలోని మాణిక్యపురం 11కెవి వ్యవసాయ ఫీడర్‌లో ఆర్‌డిఎస్‌ఎస్ పనులు నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.యజ్ఞేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బల్లిపుట్టుగ, మాణిక్యపురం గ్రామాలకు సంబంధించిన వ్యవసాయ సర్వీసులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

శిక్షణతో ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ఐతమ్ మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన విద్యార్థుల ఉద్యమిత సామర్థ్యాల పెంపునకు నెలరోజుల కార్యశాల ప్రారంభమైందని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు గురువారం విలేకరులతో మాట్లాడారు. విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీహరి సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా ప్రిన్సిపాల్ డైరెక్టర్ డాక్టర్ విజయకృష్ణ కాంత్ పాల్గొన్నట్టు చెప్పారు. ఇంజెక్షన్ మోల్డింగ్ తయారీ రంగంలో కీలక స్థానాన్ని సంపాదించుకున్న సాంకేతికత అని పేర్కొన్నారు. ఈ విభాగంలో నైపుణ్యం సాధించడం ద్వారా విద్యార్థులకు దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. ప్రాయోగిక శిక్షణలు విద్యార్థుల కెరీర్‌కు దృఢమైన పునాది వేస్తాయని అన్నారు. సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పనితీరును మెరుగుపరచేందుకు రూపొందించిన రాంప్ పథకంలో భాగంగా ప్రపంచ బ్యాంకు సహకారంతో ఈ శిక్షణ చేపట్టినట్లు డైరెక్టర్ వివరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు మాట్లాడుతూ పరిశ్రమల్లో అత్యధిక డిమాండ్ ఉన్న టూల్ రూపకల్పన, తయారీ సాంకేతికతలపై ఇంత విస్తృతమైన శిక్షణ లభించడం విద్యార్థులకు మంచి అవకాశమని పేర్కొన్నారు. డీన్ ఆర్ అండ్‌డి డాక్టర్ శ్రీరాములు, కన్వీనర్ డాక్టర్ డి.ఆజాద్, సహ కన్వీనర్ ఎం.వి. రమణ, సమన్వయకర్తలు ఎ.సతీష్ కుమార్, వై.సాగర్, ఎం.వెంకటేష్, ఆర్.పావన్‌కుమార్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నాగేశ్వరరావు


అభినందిస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తి

కష్టపడే వారికి గుర్తింపు

ప్రజాశక్తి- పోలాకి

ఏ పార్టీ లోనైనా కష్టపడే వారికి గుర్తింపు ఉంటుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. ఇటీవల జిల్లా కిసాన్ మోర్చా మండల అధ్యక్షునిగా నియమితులైన కిల్లి లక్ష్మణరావు మండలంలోని మబగాం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యేను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మణరావుకు అభినందనలు తెలిపారు. అనంతరం ఎంపిడిఒ జి.రవికుమార్‌ని, ఎస్ఐ రంజిత్‌ని, ఉపాధి హామీ అధికారులను కలిశారు. కార్యక్రమంలో పైల కావ్య, కరుకోల రామారావు, బగాది అర్జునరావు, పూతి రామకృష్ణ పాల్గొన్నారు.


జావెలిన్ త్రో వేస్తున్న క్రీడాకారుడు

ప్రజాశక్తి- నందిగాం

అంతర్ పాఠశాలల నియోజకవర్గస్థాయి గ్రిగ్స్ పోటీలు గురువారంతో ముగిసాయి. మండలంలోని లఖిదాస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ క్రీడల్లో మూడో రోజు బాలురు, బాలికలకు సంబంధించి జావెలిన్ త్రో, లాంగ్‌జంప్, హైజంప్, షార్ట్‌పుట్ వంటి క్రీడా పోటీలు నిర్వహించారు. నియోజకవర్గంలోని టెక్కలి, నందిగాం,

ఉత్సాహంగా.. ఉల్లాసంగా...

సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, మండలాల పరిధిలోని సుమారు 60 పాఠశాలల నుంచి 400 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.. ముగింపు కార్యక్రమంలో భాగంగా విజేత క్రీడాకారులకు టెక్కలికి చెందిన వైద్యులు డి.లక్ష్మణరావు, సర్పంచ్ బొంగి అమ్ములమ్మ, మోహనరావు, మాజీ సర్పంచ్ మాదిన లోకనాథం, విద్యా కమిటీ చైర్మన్ చమళ్ల సీతారాం, ప్రధానోపాధ్యాయులు చిలుకు కృష్ణారావు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగళ్ల రమేష్, జోనల్ ఇన్‌ఛార్జి కుప్పిలి ప్రకాష్, మండల ఇన్‌ఛార్జి గజలాపు శ్రీనివాస్ పర్యవేక్షణలో ముగిసిన ఈ క్రీడల్లో ఉపాధ్యాయులు కురమాన దాలయ్య, టి.తులసీప్రసాద్, గోవిందరాజు, ప్రియదర్శిని, బి.రత్నం, మార్పు మల్లేశ్వరరావు, సీతారాం, బొంగి జోగారావు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

ప్రజ్నాక్తి- పలాస

పలాస కోర్టులో ఈ నెల 13న నిర్వహిస్తున్న జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సివిల్ జడ్జి మాధురి కోరారు. స్థానిక సివిల్ కోర్టులో న్యాయవాదులతో, పోలీసులతో గురువారం సమావేశం నిర్వహించి మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ శాతం కేసులను రాజీ చేయాలన్నారు. ఆ దిశగా న్యాయవాదులు, పోలీసులు చొరవ చూపాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఫయాడ్ అహ్మద్, ఉపాధ్యక్షుడు బి.కె.ఆర్.పట్నాయక్, జాయింట్ సెక్రటరీ జిఎంఎస్ అనిల్‌రాజు, న్యాయవాదులు ప్రభాకర్, పి.ఎల్.నారాయణ, తాండ్ర మురళి, మోహన రావు, తేజా, లోకేశ్వరరావు, చిట్టిబాబు, వెంకటరావు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

స్వచ్ఛత, ప్రజారోగ్య భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ అంశాల్లో వీధి వ్యాపారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని అసిస్టెంట్ కలెక్టర్, నగరపాలక సంస్థ కమిషనరు డి. పృథ్వీరాజ్ కుమార్ అన్నారు. మెప్మా ఆధ్వర్యంలో నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో గురువారం వీధి వ్యాపారులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ ముఖ్యంగా ఆహార ఉత్పత్తులు విక్రయించే వీధి వ్యాపారులు తమ కార్య కలాపాల విషయంలో ఆహార నియంత్రణ సంస్థ నిబంధనలకు లోబడి ఉండాలన్నారు. కలుషిత వాతావరణంతో డయేరియా ప్రబలిన సంఘటనలు నగరపాలక సంస్థ పరిధిలో తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆహారంలో నాణ్యత, పరి శుభ్రత, వేడి పదార్థాలు అమ్మకం వంటి అంశాలు కీలకంగా చెప్పారు. ట్రాఫిక్ క్రమ బద్దీకరణలో ఎటువంటి అవాంతరం లేకుండా బాధ్యతగా ఉండాలన్నారు. నిరంతరం ఆకస్మిక తనిఖీలు చేపడతామని, నిబంధనలు మీరిన వారిపై చట్టపరమైన కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి పి.సుధాకర్, మెప్మా పీడీ ఎస్.వెంకటరావు, మున్సిపల్, మెప్మా సిబ్బంది కె.ప్రభాకర్, బి.రామారావు, వై.శారదావాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పృథ్వీరాజ్ కుమార్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

పట్టణంలో అరసవల్లి రోడ్డులో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పంచిరెడ్డి శ్రీనివాసరావు (44) మృతి చెందాడు. ఎచ్చెర్ల మండలం బొంతల కోడూరుకు చెందిన శ్రీనివాసరావు ద్విచక్ర వాహనంపై అరసవల్లి వైపు వెళుండగా వెనుక నుంచి వస్తున్న లగేజ్ వ్యాన్ ఢీ కొట్టింది. దీంతో సంఘటనా స్థలంలోనే శ్రీనివాసరావు మృతి చెందాడు. శ్రీకాకుళం ట్రాఫిక్ ఎస్ఐ సుధాకర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.


మృతుడు శ్రీనివాసరావు

చోరీకి పాల్పడిన ముగ్గురు అరెస్టు

రూ. 1.71 లక్షల విలువైన సొత్తు స్వాధీనం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

జిల్లాలో పలు ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడిన ముగ్గురు నిందితులను శ్రీకాకుళం రూరల్ పోలీసులు అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి సుమారు రూ. 1.71 విలువైన వెండి, ఇత్తడి, రాగి, కంచు వస్తువులు, నగదు రికవరీ చేసినట్లు డిఎస్‌పి సిహెచ్ వివేకానంద తెలిపారు. డిఎస్‌పి కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. పెద్ద గనగల్లవానిపేటకు చెందిన చింతపల్లి గోపాల కృష్ణమూర్తి జూలై 26న ఫిర్యాదు చేశారన్నారు. ఆ ఫిర్యాదు ఆధారంగా దర్యాప్తు చేసినట్లు చెప్పారు. తమ గ్రామంలోని శ్రీ శిర్డీ సాయిబాబా ఆలయంలో తాళాలు పగలగొట్టి వెండి కిరీటాలు, వెండి పాదాలు, వెండి దీపం కుద్దులు, వెండి గంట, నగదు దొంగిలించారని ఫిర్యాదు చేసినట్లు చెప్పారు. కేసులో ఎరుపల్లి అశోక్ (జాలారిపేట గ్రామం, కల్లేపల్లి పంచాయతీ), చోడిపల్లి వంశీ (బలరాంపురం గ్రామం, గార మండలం.) బెండి శివప్రకాష్ (తోటాడ గ్రామం, ఆమదాలవలస మండలం.) చెందిన వ్యక్తులను అరెస్టు చేసినట్లు చెప్పారు. ముగ్గురు గతంలో ఆమదాలవలస పోలీస్ స్టేషన్ పరిధిలో మోటార్‌సైకిల్ దొంగతనం కేసులో అరెస్ట్ అయి 45 రోజులు జైలుశిక్ష అనుభవించారన్నారు. అనంతరం చెడు వ్యసనాలకు లోనై, రాత్రి సమయంలో దేవాలయాల్లో చోరీలు ప్రారంభించారన్నారు. శ్రీకాకుళం రూరల్, శ్రీకాకుళం పట్టణం, నందిగాం తదితర ప్రాంతాల్లో 15 కేసులు వీరిపై నమోదైనట్లు చెప్పారు. నిందితులను బుధవారం జాతీయ రహదారికి ఆనుకొని అంపోలు ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద ముగ్గురు ముద్దాయిలను అరెస్ట్ చేశామన్నారు. కేసును చేదించడంలో చాకచక్యంగా వ్యవహరించి, ప్రతిభ కనబరిచిన అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో డిఎస్‌పి సిహెచ్ వివేకానంద మార్గదర్శకత్వంలో దర్యాప్తు చేసిన రూరల్ సర్కిల్ సిఐ కె.పైడపునాయుడు, రూరల్ ఎస్ఐ కె.రాము, సిబ్బంది జగదీష్, రవి, బాబూరావును ఎస్‌పి కె.వి. మహేశ్వర్ రెడ్డి అభినందించారు.


చోరీ వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి వివేకానంద



వినతిపత్రం అందజేస్తున్న రాజశేఖర్‌రెడ్డి

ఎమ్మెల్యే దృష్టికి మండల సమస్యలు

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండల సమస్యలను ఎమ్మెల్యే మామిడి గోవిందరావు దృష్టికి మండల నాయకులు తీసుకెళ్లారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. మెళియాపుట్టిలో క్రీడా మైదానం పనులు అసంపూర్తిగా నిలిచిపోవడంతో యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులను వివరించారు. ఎమ్మెల్యే స్పందించి క్రీడా మైదానం పూర్తికి కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడుతో మాట్లాడి నిధులు మంజూరు చేయిస్తానని తెలిపారు. అదేవిధంగా పొందరకు సామాజిక భవనం నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి మండల మాజీ అధ్యక్షులు అనపాన రాజశేఖర్‌రెడ్డి, సర్పంచ్ ప్రతినిధి రేఖాన వాసు, పెద్దపద్మాపురం సర్పంచ్ ప్రతినిధి మాలతి శ్రీధర్, యంగ్‌మెన్ యూత్ సభ్యులు గాలి నగేష్, శంకర్, ఢిల్లీ, బృందావన్, మణి పాల్గొన్నారు.



మొక్కను అందజేస్తున్న సిబ్బంది

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీను అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస నెమలికొండ ప్రాంతం దత్తాత్రేయ ఆశ్రమం ప్రాంతంలో రూ.15 లక్షల వ్యయంతో నిర్మాణం చేపట్టనున్న సిసి రోడ్డు పనులకు గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీలకతీతంగా వార్డులను అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. ప్రతి వార్డులోనూ తాగునీటి సౌకర్యం కల్పించడం రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వజ్జ గంగా భవాని, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, డొక్కరి శంకర్, మల్లా శ్రీనివాసరావు, టంకాల రవిశంకర్ గుప్తా, బి.నాగరాజు పాల్గొన్నారు.



ఆక్రమణలను తొలగిస్తున్న రెవెన్యూ అధికారులు

గోకర్ణపల్లిలో ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని గోకర్ణపల్లి గ్రామ పరిధిలోని రస్తా (గోర్జ) పోరంబోకు ఆక్రమణలను గురువారం తహశీల్దార్ ఆర్.వెంకటేష్ రామానుజులు ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు తొలగించారు. గ్రామంలోని సర్వే నెంబర్ 16-11లో గల రస్తా పోరంబోకు (గోర్జ) 3సెంట్లు స్థలం ఆక్రమణకు గురైనట్లు పిజిఆర్‌ఎస్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు పరిశీలించారు. దీనిపై సర్వే చేపట్టి సుమారు 3సెంట్లు స్థలం ఆక్రమణకు గురైనట్లు గుర్తించి వాటిని జెసిబి సహాయంతో తొలగించారు. మరలా ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామంటూ ఆక్రమణదారులను తహశీల్దార్ హెచ్చరించారు. ఈయనతో పాటు ఎస్ఐ వి.సత్యనారాయణ, మండల సర్వేయర్ గణపతిరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ప్రశంసాపత్రం అందజేస్తున్న ప్రిన్సిపాల్ లత

డిగ్రీ కళాశాల విద్యార్థి ప్రతిభ

నరసన్నపేట: నరసన్నపేట డిగ్రీ కళాశాల విద్యార్థి క్రీడల్లో ప్రతిభ కనబరిచినందుకు అబినందనీయమని ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇటీవల కోడిరామ్మూర్తి స్టేడియంలో నిర్వహించిన జిల్లాస్థాయి స్పోర్ట్స్ మీట్‌లో బారత్ ప్రభుత్వ క్రీడలు, యువజన మంత్రత్వ శాఖ ఆధ్వర్యాన 100 మీటర్ల పరుగు పందెంలో పి.పుష్పలత ద్వితీయ స్థానంలో సాధించారు. ఆ విద్యార్థినికి గురువారం అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ, అధ్యాపకులు అన్నాజీరావు, త్రినాథరావు, ఢిల్లీశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.



ఆటలాడుతున్న విద్యార్థులు

కొనసాగుతున్న సేవా శిబిరం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జాతీయ సేవ శిబిరం ఆధ్వర్యాన జెమ్స్ ఆస్పత్రి వైద్యులతో వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. గురువారం ఎన్ఎస్ఎస్ వాలంటర్లు గోవిందపురం హైస్కూల్ ఆవరణలో స్వచ్ఛ భారత్ నిర్వహించారు. 9,10 తరగతి విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. మెగా వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.రూప్ సుందర్, అధ్యాపకులు ఝాన్సీ, రాంబాబు, భాగ్యలక్ష్మి, శోభారాణి, ఆలేఖ్య, సౌజన్య, వాణి, రమణ, పున్నయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

కొత్తూరు : మండలంలోని కుంటిభద్ర, మాహర్తపురం గ్రామాల్లో వెంకటేశ్వర డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పరిసరాలు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వీధుల్లో గురువారం అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ జి.కృష్ణారావు, పిఒలు జి.మహేష్, కె.హరిప్రసాద్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

యూరియా కోసం రైతుల అవస్థలు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని దల్లిపేట పంచాయతీకి చెందిన రైతులు గురువారం యూరియా కోసం నానా అవస్థలు పడ్డారు. మండలంలోని బాణాం రైతుసేవా కేంద్రంలో గురువారం దల్లిపేట పంచాయతీ పరిధిలో దల్లిపేట, పుల్లాజీపేటకు చెందిన రైతులకు 222 యూరియా బస్తాలను వ్యవసాయ అధికారులు పంపిణీ చేశారు. రేషన్‌లైజేషన్‌లో భాగంగా దల్లిపేట రైతు సేవా కేంద్రాన్ని బాణాం రైతుసేవా కేంద్రంలో అధికారులు విలీనం చేశారు. దీంతో పుల్లాజీపేట, దల్లిపేటకు చెందిన రైతులు సుమారు 6 కిలోమీటర్లు దూరంలో గల బాణాం రైతుసేవా కేంద్రానికి వెళ్లి యూరియా తీసుకోవాలంటే ఎన్నో వ్యయప్రయాసలకు గురై తీవ్ర ఇబ్బందులు పడ్డామంటూ రైతులు ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. యూరియాను ద్విచక్ర వాహనం ఉన్న కొంతమంది రైతులు వాహనంపై తీసుకువెళ్లగా, మరికొందరు ఆటోలను కట్టించుకుని బస్తాలను తీసుకువెళ్లారు. మరికొందరూ అవస్థలు పడుతూ యూరియా బస్తాలను మోసుకుంటూ తీసుకువెళ్లారు.



పోలీసుల సమక్షంలో యూరియా కోసం క్యూలో నిల్చొన్న రైతులు

గతంలో యూరియా పంపిణీ సమయంలో వివాదాలు తలెత్తిన నేపథ్యంలో ఎటువంటి అల్లర్లు తలెత్తకుండా ముందుస్తుగా పోలీసు బందోబస్తు నడుమ పంపిణీ చేశారు. దీంతో అంతదూరం ఎన్నో వ్యయప్రయాసలకులోనై యూరియాను తీసుకోవల్సి వస్తుందని, అధికారులు తమ గ్రామాల సమీపంలోనే యూరియాను పంపిణీ చేసేలా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలంటూ ఆయా గ్రామాల రైతులు కోరుతున్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న నాగరాజు

పేదలకు దుప్పట్లు పంపిణీ

కోటబొమ్మాళి: స్థానిక కొత్తమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలో టిడిపి నాయకులు నౌగాపు నాగరాజుతో సంతబొమ్మాళి మండలం వల్లేవలస మా బడి స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయంతో గురువారం నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు మాస్టర్, ఇప్పిలి అప్పన్న, శివ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు నౌగాపు సుశీల పాల్గొన్నారు.

హక్కుల కోసం సంఘటిత పోరాటం

ప్రజాశక్తి- నరసన్నపేట

ట్రెజరీ కార్యాలయంలో ఎపి నాన్ గెజిటెడ్, గజిటెడ్ అధికారుల అసోసియేషన్ ఎన్నికలు గురువారం ప్రజాస్వామ్యబద్ధంగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా బి.శ్రీనివాసరావు అధ్యక్షులు శ్రీకాకుళం టౌన్ బ్రాంచ్, అసిస్టెంట్ ఎలక్షన్ అధికారిగా బి.నవీన్ కుమార్ కార్యదర్శి శ్రీకాకుళం టౌన్ బ్రాంచ్ వారు వ్యవహరించారు. ఎన్నికలను ప్రక్రియ మొత్తం ఎపిఎన్‌జిఒ జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం ఆధ్వర్యాన ఎన్నిక నిర్వహించారు. నరసన్నపేట యూనిట్ అధ్యక్షునిగా డాక్టర్ నల్లి రవికుమార్, కార్యదర్శిగా ఎం.ఎం.ఎస్.భరద్వాజ్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎల్.మురళీకృష్ణ, ట్రెజరర్‌గా విజయభాస్కర్, వైస్ ప్రెసిడెంట్‌గా టి.గణపతి, కె.కృష్ణమూర్తి, ఎస్.ప్రసాదరావు, జాయింట్ సెక్రటరీగా కిరణ్‌కుమార్. ఎస్.సౌజన్యదేవి, పి.సింహాచలం,



ప్రమాణ స్వీకారం చేస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఎ.చందనలు ఎన్నికయ్యారు. ఉద్యోగులు తమ ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులు సాధించుకోవాలనికి సంఘటితంగా పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఎన్నికైన సభ్యులను సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు జయరావు, జానకిరామ్, రాధాకృష్ణ, సత్యనారాయణ పాల్గొన్నారు.

కుమార్తె ఆచూకీ కోసం ఎదురుచూపు



లక్ష్మి

కోటబొమ్మళి: ఆ వృద్ధురాలి ఆవేదన అసంచలమైనది. అందరినీ కోల్పోయి ఆఖరికి ఎప్పుడో దూరమైన కుమార్తె అయిన తన తోడు నీడ అవుతుందేమోనని ఆశ. వివరాల్లోకి వెళ్తే... మండలంలోని పట్టుపురానికి చెందిన బారికి లక్ష్మికి కుమార్తె కరుణమ్మ (వివాహిత) కొన్నేళ్ల క్రితం మతమార్పిడి పేరుతో ఇల్లు వదిలి మరో మహిళతో కలిసి అదృష్టమైంది. అయితే అప్పట్లో తమకు చెప్పకుండా కుటుంబాన్ని వదిలి వెళ్లిపోయిందని బాధతో ఎటువంటి ఫిర్యాదులు చేయలేకపోయారు. కాలక్రమేనా వృద్ధాప్యం మీద పడడం భర్త పోతయ్య ఏడాది క్రితం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో అనాదిగా మిగిలిన ఈ వృద్ధ లక్ష్మి తోడు కోసం కుమార్తె ఆచూకీ కోసం ప్రాకులాడుతుంది. మానసికంగా కూడా ఆమె అదుపుతప్పుతోంది. ఈ తరుణంలో ఆమె కోటబొమ్మాళి ప్రకాష్‌నగర్ కాలనీలో తమ బంధువుల సహాయంతో నివాసం ఉంటుంది. ఇప్పటికైనా కుమార్తె ఆచూకీ దొరికితే ఆఖరి క్షణాల్లో తనకు తోడుగా ఉంటుందేమోనని ఆమె ఆక్రందన వ్యక్తం చేసింది. అయితే ఇప్పుడు కన్నప్రేగు, నిస్సహాయ స్థితిలో దిక్కు తోచని పరిస్థితిలో బిడ్డ కోసం ఆమె తపిస్తున్న వైనం అందరినీ ఆలోచింప చేస్తుంది.

ప్రేరణా ప్రగతిపై కాన్ఫరెన్స్

ప్రజాశక్తి- పొందూరు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో జయహో పంచాయతీరాజ్ ప్రేరణా ప్రగతి, జయహో గ్రామీణాభివృద్ధి ఘనవృద్ధి కార్యక్రమంలో భాగంగా గురువారం ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల అభివృద్ధికి సంబంధించి పలు విషయాలను తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ జిఎస్‌డబ్ల్యుఒ దుంపల అప్పన్న, పరిపాలనాధికారి మధుసూదనరావు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.



సంతకాలు సేకరిస్తున్న కృష్ణారావు

ఇప్పిలిలో సంతకాల సేకరణ

ప్రజాశక్తి- కంచిలి

కంచిలి మండల కేంద్రంలో మాజీ ఎంపిపి, వైసిపి నాయకుడు ఇప్పిలి కృష్ణారావు ఆధ్వర్యాన మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకంగా గురువారం సంతకాలు సేకరణ కార్యక్రమం చేపట్టారు. స్థానిక రైల్వే స్టేషన్ బస్ స్టాండ్ దగ్గర శిబిరాలను ఏర్పాటు చేసి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున విద్యార్థులు పాల్గొని సంతకాలు చేపట్టారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు రత్నాల సారధి చౌదరి, మాజీ వైస్ ఎంపిపి మునకాల వీరాస్వామి పాల్గొని సహకారం అందజేశారు.



అభినందిస్తున్న టిడిపి నాయకులు

హరీష్‌ను కలిసిన టిడిపి నాయకులు

కంచిలి : విశాఖపట్నం అసిస్టెంట్ సేల్స్ కమిషనర్‌గా గురువారం పదవీ బాధ్యతలు చేపట్టిన మర్రిపాటి హరీష్ కుమార్‌ను టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. టిడిపి మండల అధ్యక్షుడు మాదిన రామారావు ఆధ్వర్యాన నాయకులు మర్రిపాటి పూర్ణచంద్రుడు, బొడ్డ హరిబాబు, టి.వి.రమణ తదితరులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.



ఆపరేషన్ ఎంపికైన రోగులు

69 మందికి నేత్ర వైద్య పరీక్షలు

కొత్తూరు : స్థానిక ఎంకటేశ్వర ఆలయ ప్రాంగణంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ సహకారంతో, రాగోలు జెమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యాన గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఆప్తాలమిక్ వైద్యాధికారి ఇప్పిలి జానకిరామయ్య 69 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 26 మందికి ఆపరేషన్ కోసం ఎంపిక చేసి జెమ్స్‌కు తరలించారు. కార్యక్రమంలో జెమ్స్ పిఆర్ఒ రాము పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణ తప్పనిసరి

సంతబొమ్మాళి : హోటళ్లు, స్వీట్స్, పానీపూరి, టిఫిన్ దుకాణాల యజమానులు పారిశుధ్య నిర్వహణ తప్పనిసరిగా పాటించాలని కార్యదర్శి ఉమాపతి కోరారు. నౌపడ పంచాయతీలో సంబంధిత యజమానులతో గురువారం సమావేశం నిర్వహించారు. వంటకాల్లో నాణ్యత, శుద్ధి చేసిన నీటి వినియోగం, వంట గది, పరిసరాల శుభ్రత తప్పనిసరని సూచించారు. ప్లాస్టిక్ బ్యాగ్‌లు వాడకూడదని సూచించారు. డస్ట్‌బిన్ తప్పనిసరిగా ఉంచాలన్నారు. కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

మెరిసిన ఎం.సున్నాపల్లి విద్యార్థులు

సంరతబొమ్మాళి: నందిగాం మండలం లఖిదాసుపురం జడ్‌పి హెచ్‌ఎస్‌లో నిర్వహించిన డివిజనల్ గ్రిగ్స్ ఖోఖో (సీనియర్, జూనియర్) పోటీల్లో ఎం.సున్నాపల్లి ఎంపిపిఎస్ విద్యార్థినులు ప్రథమ స్థానం సాధించి మెరిశారు. జిల్లాస్థాయి పోటీలకు అర్హత పొందిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు జివిఎస్ శాస్త్రి, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు, పిఇటి రాజులరెడ్డి అభినందించారు. దీంతో విజేతలకు ఉపాధ్యాయులు అభినందించారు.



పరిశీలిస్తున్న తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి

ఆర్‌అండ్‌ఆర్ కాలనీ పరిశీలన

ప్రజాశక్తి- పలాస

మండలంలోని గోపీవల్లభపురం ఆర్ అండ్ ఆర్ కాలనీని తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి గురువారం పరిశీలించారు. మండలంలోని రేగులపాడు ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్మాణంలో భాగంగా రేగులపాడుకు చెందిన కొంత మంది నిర్వాసితులకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని గ్రామస్తులు చెప్పారు. దీంతో తహశీల్దార్ తన బృందంతో కలిసి ఆఫ్‌షోర్ రిజర్వాయరు నిర్వాసితుల కాలనీను సందర్శించారు. ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇంకా ఎన్ని ఇళ్ల స్థలాలు ఉన్నాయి, ఖాళీలు ఏమైనా ఉన్నాయా తదితర అంశాలను గ్రామస్థాయి రెవెన్యూ అధికారులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో నిర్వాసితులకు ఇళ్ల స్థలాల పట్టాలను పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాదరావు, మండల సర్వర్ గిరి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మిల్లర్ల దగాను కట్టడి చేయాలి

ప్రజాశక్తి- నందిగాం

ధాన్యం కొనుగోలులో మిల్లర్లు రైతులను దగా చేస్తున్న విధానం చూస్తుంటే రైతు కంట కన్నీరు కనిపిస్తుందని, దానిని నివారించాలని నియోజకవర్గం కాపు సామాజిక సంక్షేమ సంఘం నాయకులు అన్నారు. ఈ మేరకు తహశీల్దార్ పి.సోమేశ్వరరావును గురువారం కలిసి వినతిపత్రం అందజేశారు. మిల్లర్లు 80 కేజీల బస్తాకు నాలుగు కేజీల వరకు తేమ పేరుతో రైతులు వద్ద నుంచి వసూలు చేస్తున్నారని తెలిపారు. అలాగే దించేందుకు రూ.20 చొప్పున వసూలు చేసి రైతులను నిండా ముంచేస్తున్నారని పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో టి.మహేష్, దివాకర్, టి.బలరాం, ఎస్.లావణ్య, సంజీవరావు, వాసుదేవరావు ఉన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



మాట్లాడుతున్న తహశీల్దార్ అప్పలస్వామి

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు 24 రైతు సేవ కేంద్రాల పరిధిలో 11 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్టు తహశీల్దార్ బి.అప్పలస్వామి తెలిపారు. ఈ మేరకు వ్యవసాయశాఖ, పౌరసరఫరాల, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధికారులతో గురువారం సమావేశమై చర్చించారు. తరలింపునకు సిద్ధం చేసిన ధాన్యం తేమ 17 శాతం పెంచకుండా ఉండాలని సూచించారు. రైతులు కోరిన మిల్లులకు అవసరమైన ట్రక్ షీట్లను ధాన్యం సేకరణ సిబ్బంది రైతు సేవా కేంద్రాల్లో అందజేస్తారని తెలిపారు. ట్రక్ షీట్ అందిన వెంటనే ధాన్యాన్ని మిల్లలకు తరలించాలని సూచించారు. సమావేశంలో ఎఒ బి.నరసింహమూర్తి, సిఎస్‌డిటి కూర్మారావు, పిఎసిఎస్ అధికారి నారాయణ రావు, డిసిఎంఎస్ ప్రతినిధి రాజేష్ పాల్గొన్నారు.

పొలం పనుల్లో రైతులు బిజీ


ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

మండలంలోని వజ్రపుకొత్తూరు, పాతటెక్కలి, నగరంపల్లి, పూండిగల్లి, బెండి,సీతాపురం, పెద్దబొడ్డపాడు, కొండవూరు గ్రామాల్లో రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. వాతావరణంలో మార్పులు కారణంగా బుధ, గురువారాలు మేఘం మబ్బులు కాసింది. దీంతో రైతులు ఆందోళన చెంది కోత కోసిన వరి చేలును కుప్పగా పెట్టుకున్నారు. రైతులు ఎన్నో ఆశలతో వేలాది రూపాయాలు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట చేతికి అందుతున్న తరుణంలో వాతావరణంలో వచ్చిన మార్పులతో వణికిస్తుంది. దీంతో పంటను కుప్పలు పెడుతూ టార్పాలిన్లు, పరదాలు కప్పి భద్రపరుస్తున్నారు. అలాగే కొంత మంది రైతులు యంత్రాల సాయంతో కోత, నూర్పులు చేసిన ధాన్యం ఇంకా పంట పొలాల్లోనే నిల్వ ఉండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.



కుప్పలు పెడుతున్న రైతులు

ఘంటసాల స్వరం తెలుగు భాషకు వరం



నివాళ్లర్పిస్తున్న ప్రతినిధులు

ప్రజాశక్తి- అరసవల్లి

ఘంటసాల స్వరం తెలుగు భాషకు వరమని సిక్కోలు ఘంటసాల గాయకులు కెఎల్‌ఎం మూర్తి అన్నారు. గురువారం మధుర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు జయంతి సందర్భంగా బాపూజీ కళామందిర్ వద్ద ఉన్న ఘంటసాల విగ్రహానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘంటసాల మరుపురాని మధురమైన గీతాలు ఆలపించారన్నారు. కార్యక్రమంలో రంగస్థలం కళాకారుల సమాఖ్య గౌరవ అధ్యక్షులు పన్నాల నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఘంటసాల పాడిన గీతాలను ఇంజరాపు రమణారావు, కంచరాన అప్పారావు పాడి వినిపించారు.

వైద్య శిబిరానికి స్పందన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని తోలాపిలో సత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో శ్రీకాకుళం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన 150 మందికి ఇసిజి, 2డి-ఎకో, షుగర్, గుండెకు సంబంధించిన అన్ని రకాల పరీక్షలను నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసమితి కన్వీనర్ శ్రీనివాస్, కో-ఆర్డినేటర్ ఢిల్లీబాబు, వైద్యులు, సిబ్బంది, సేవాదల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



శిబిరంలో పాల్గొన్న వైద్యులు, సేవాసమితి సభ్యులు



ప్రమాణ స్వీకారం చేస్తున్న కార్యవర్గ సభ్యులు

ఎలియన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ఎలియన్స్ క్లబ్ నూతన కార్యవర్గానికి గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా గవలాపు ఉమాశంకర్, కార్యదర్శిగా లాభాల వెంకటరమణ, ఉపాధ్యక్షులుగా చాట్ల లోహిదాస్, సంయుక్త కార్యదర్శి ఆసి రవి, కోశాధికారిగా పసుపురెడ్డి ఢిల్లీ, ఉప కోశాధికారిగా పి.లోహిదాస్, డైరెక్టర్లుగా బత్తుల వెంకట రమణ, మద్ది బాలకృష్ణ, శ్రీనివాస్ సాహు ఎన్నికయ్యారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాజీ అధ్యక్షులు లోపింటి నరసింహమూర్తి అధ్యక్షతన ఎలియన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక నిర్వహించారు.



సన్మానిస్తున్న గ్రామస్తులు

విజేతలకు సన్మానం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అరవై తొమ్మిది జాతీయ తైక్వాండోలో బ్రాంజ్ మెడల్ సంపాదించిన ఆశి రేవంత్‌రెడ్డికు స్థానిక పెద్దలు గురువారం సన్మానించారు. అండర్-17 నేషనల్ గేమ్స్‌లో 78 కేజీ కేటగిరిలో ఆడారు. ఈ క్రీడలు అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఈటానగర్‌లో నవంబరు 24 నుంచి 30 వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో రేవంత్‌రెడ్డి కాంస్య పథకం సాధించారు. అలాగే రేవంత్ రెడ్డికి కేలో ఇండియా గేమ్స్‌లో పాల్గొనటానికి అవకాశం కూడా లభించింది. ఇండియా గేమ్స్‌లో కూడా మంచి ప్రతిభ కనబరచి మెడల్ సాధించాలని అభినందించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, హెచ్‌ఎం సూర్య, కౌన్సిలర్ ప్రతినిధి పిలక విజయ్, పట్టణ టిడిపి కార్యదర్శి నందిగాం కోటేశ్వరరావు, కౌన్సిలర్ ఆశి లీలారాణి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆశి జీవులురెడ్డి, ఎస్ఎంఎస్ చైర్‌పర్సన్ లతారెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు ఆశి గౌరీశంకర్‌రెడ్డి, కామరాజు, జయలక్ష్మి, సాయిబాబా, కృష్ణయ్య, కోచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



గోల్డ్ మెడల్ సాధించిన సాయి

సాయికి గోల్డ్ మెడల్

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని ఎర్రముక్కాం గ్రామానికి చెందిన పొట్టి సాయి అనిరుధ్ పవర్ లిఫ్టింగ్ 125 కిలోల బెంచ్ ప్రెస్ పోటీల్లో విజేతగా నిలిచి గోల్డ్ మెడల్ పొందాడు. ఫస్ట్ ఓపెన్ విశాఖ జూనియర్స్, సీనియర్స్ అండ్ మాస్టర్స్ బెంచ్ ప్రెస్ అండ్ డెడ్ లిఫ్ట్ పోటీలను విశాఖ డిస్ట్రిక్ట్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన వెలంపేట విజయాంధ్ర వ్యాయామ మండలి వద్ద బుధవారం రాత్రి నిర్వహించారు. ఈ పోటీల్లో సాయి ప్రతిభ కనబరుస్తూ విజేతగా నిలిచాడు. విశాఖ గీతంలో బిటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్న సాయి కొద్ది నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన హెడ్ కానిస్టేబుల్ జగదీష్ కుమారుడు. లిఫ్టింగ్‌లో ప్రతిభ కనబరిచిన సాయికి గీతం స్పోర్ట్స్ డైరెక్టర్ అరుణ్ కార్తీక్, విశాఖ వాడబలిజ సంక్షేమ సంఘం అధ్యక్షుడు హరికృష్ణ అభినందించారు.



పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ శ్రీనివాస్

ఎమ్మెల్సీ పరామర్శ

టెక్కలి రూరల్ : టెక్కలి నియోజకవర్గంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ గురువారం పరామర్శించారు. సంతబొమ్మాళి మండలం బోరుభద్రలో పట్నాన శ్రీకాంత్ ఇటీవల మృతి చెందారు. టెక్కలి మండలం తలగాంలో వైస్ ఎంపిపి పేరాడ రమేష్ పెద్దమ్మ మృతి చెందింది. నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జి కణితి కిరణ్ కుమార్ అమ్మమ్మ మృతి చెందారు. మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

సర్పంచ్‌కు సత్కారం

ప్రజాశక్తి- సోంపేట

మండలంలోని పలాసపురం సమీపంలోని చెరువు వెనుక రావిటి రైతుల కోసం పంచాయతీ సర్పంచ్, జెడ్‌పిటిసి నిధులతో రైతులకు సౌకర్యంగా చెరువు వద్ద వంతెన నిర్మించారు. ఇందుకు గాను రైతులు, శ్రీశయన సంఘం మాజీ ప్రెసిడెంట్ దుద్ది ధర్మారావు, దుద్ది కోదండరావు, దేవాడ దుర్యోధన, దుద్ది రాజారావు, బినా గంగారావు, దుద్ది జానకిరావు తదితర రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తడక జోగారావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు.



సన్మానిస్తున్న రైతులు